# మాసికల గళ్ళకోటు

ఆ వేళ విమెన్స్ కాలేజిడే! వాసంతి నడక ప్రారంభించింది అరగంటకి కాలేజి ఆవరణ చేరింది. అక్కడ అలంకరణలన్నీ చూడగానే, 'అది తను ఇన్నాళ్ళ నుంచి చదువుతున్న కాలేజీయేనా?' అని అనుమానం కలిగింది వాసంతికి. వాసంతి ప్రీయూనివర్సిటీ కోర్సు చదువుతోంది. తను కాలేజీలో చేరిన మొదటిరోజు కాలేజీ చాలా అందంగా కనిపించింది ఏ అలంకరణలు లేకపోయినా. అనాడు తను ఒక మహోన్నత శిఖరాన్ని ఆరోహిస్తున్నట్టు భావించి గర్వించింది. ఈ నాడు మళ్ళీ యిన్నాళ్ళకు అదే. కాలేజి ఇంకా అందంగా కన్పిస్తోంది -

కాలేజి ఆవరణలో తన స్నేహితురాళ్ళంతా చాలా ఆనందంగా తమ తమ తల్లి దండ్రులతో ముచ్చటించుకొంటున్నారు. మరి కొంతమంది చాలా బిజీగా అటూ ఇటూ తిరుగుతున్నారు. తన రాకను వాళ్ళెవరూ గమనించలేదు. గమనించినా ఎవరూ పలకరించలేదు.

తన స్నేహితురాళ్ళంతా అంతటి మంచి మంచి దుస్తులతో మెరిసిపోతుంటే మురిసిపోయింది వాసంతి మొదట. తర్వాత వారి అదృష్టానికి అసూయపడింది. చివరికి తన మామూలు ప్రింటెడ్ వాయిల్ చీరె చూసుకొని తనమీద తను జాలిపడింది. 'ఎవరికెంత ప్రాప్తమో అంతే!' అనుకొని సమాధాన పడింది. ఆ సమయంలో ఆమెకు భగవంతునిపై కించిత్ కోపం కలిగిన మాట మాత్ర వాస్తవం!

అంతలో 'హల్లో వాసంతీ! మీ పేరెంట్స్ ఏరి?...' అని అడిగింది ఒక స్నేహితురాలు.

'రాలేదే! రావడానికి తీరిక



ప్రథమ బహుమతి రూ. 50

మాలిని రావు
బి. ఎస్‌సి. 3వ సంవత్సరం
విమెన్స్ యూనివర్సిటీ కాలేజీ,
హైదరాబాద్

లేదన్నారు మా నాన్నగారు. మా అమ్మ లేదని నీకు తెలుసుగా."

"సరేగానీ, యిదేమిటి యివాళ కూడా యిటువంటి చౌకబారు చీరె కట్టుకొచ్చావు?" అన్నది మామూలుగా ఆ స్నేహితురాలు. కానీ ఆ మాటలు చాలా పరుషంగా, హేళనతో అన్నట్లు వినిపించింది వాసంతికి. జవాబు ఏమీ ఆశించకుండానే నిష్క్రమించింది ఆ స్నేహితురాలు

తన చీరెవైపు ఓకసారి చూసుకొంది వాసంతి. నిజానికి తనకున్న చీరెలలోకల్లా బాగున్నదీ చీరె ఒక్కటే. కానీ అదీ చెత్తచీరె అనేసి వెళ్ళిపోయింది ఆ మహాతల్లి రాలు. అంటే అర్థం రోజూ కట్టుకొనే వింతకంటే చెత్తవనేనా?...

తనమీద, తన దారిద్ర్యంమీద చాలా కోపం వచ్చింది వాసంతికి. తను యింటి దగ్గిరే ఒక మూలకూర్చొక ఆగుదునమ్మా అని ఎందుకు బయల్దేరాలి? ఛ ఛ! అనుకుంది.

టీ పార్టీ అదీ పూర్తయింది. వాసంతికి తను ఏం తింటున్నదో కూడా పట్టలేదు. తన స్నేహితురాలు అన్న మాటమీద ఆలోచిస్తూ కూర్చొంది. అంతవరకూ ధనవంతులమీద ఆమెకు అసూయే గాని, కక్షలేదు. ఇప్పుడు మనస్సులో వారి మీద ఏదో తీరని పగలాంటి భావం మెదిలింది. కాని వారిమీద తను పగ ఎలా తీర్చుకోగలదు?

పార్టీ తర్వాత నాటిక జరుగుతుండగా సన్నని తుప్పర ప్రారంభమైంది. అది పెద్దది కాకుండానే నాటిక అయిపోయింది.

వాసంతి దర్బార్ హాలుముందు నిలబడింది, ఎవరైనా కారుగల సహవిద్యార్థిని తనను యింటివద్ద దింపుతుందేమోనని ఎదురుచూస్తూ. పావుగంట గడిచింది. ఆశ నిరాశ చేసుకుంది. గేటు వరకు వచ్చింది. బైట అయిదారుగురు రిక్షావాళ్ళు మాత్రం వున్నారు. తుప్పర కాస్త పెద్దదవటంతో రిక్షావాళ్ళు మరీ యెక్కువ అడిగారు. మామూలు పావలా అర్ధరూపాయ చేశారు. వాసంతికి వేరే మార్గం లేకపోయింది. చీరె భుజాలనిండా పూర్తిగా కప్పుకొని నడక సాగించింది.

తను నడుస్తోంటే రిక్షావాళ్ళు నవ్వుకుంటున్నట్టు అనిపించింది. ఆమెకు తన తండ్రి మీద ఒక్కసారిగా విపరీతమైన కోపంవచ్చింది. "ఏదో గొప్పగా ఇస్తున్నట్టు ఒక ముష్టి పదిరూపాయలు తన ఖర్చులకని ఇస్తారు - ప్రతి నెలా తను జీతం అందుకోగానే. అది తన రిక్షా ఖర్చుకికూడా సరిపోదు. తన స్నేహితురాళ్ళంతా ఎగతాళిగా చూస్తారు. నవ్వుతారు. "రోడ్లమీద వెళ్ళే మగాళ్ళంతా తన అందాన్ని చూడాలని మహా కోరికే మన వాసంతికి" అంది ఒకమ్మాయి ఒక

రోజు తను వింటుండగా. తనకు అరికాలిమంట నెత్తికెక్కింది. దాన్ని చితక్కొడదామన్నంత కోపం వచ్చింది. కాని తన్ను తానే నిగ్రహించుకొంది అది తలచుకొంటే ఆ నాడు ఆ పిల్లను ఎందుకు వదిలిపెట్టానా అని బాధగా వుంటోంది. మళ్ళీ యీ రోజు అదే తలపుకు వచ్చింది. కానీ ఈ సారి ఆ పిల్ల మీద కోపంరాలేదు. ఆ కోపం అంతా తండ్రిమీదకు తిరిగింది. ఈ సారినుంచి పది రూపాయలు తీసుకోకూడదు. పదిహేను ... కాదు, కాదు ఇరవై రూపాయలు తీసుకోవాలి. అప్పుడు తనూ అందరిలాగే 'లంచ్ అవర్'లో తాజ్‌కు వెళ్ళి అయిస్‌క్రీములు, కాఫీలు తీసుకో వచ్చు ఏమైనా యివాళ నాన్నతో దెబ్బలాడాలి, ఎలాగైనా నెలకు ఇరవై రూపాయల చొప్పున తీసుకోవాలి!... ఇంతలో వాసంతి యిల్లు చేరింది.

అంతవరకు దిగులుగా కూతురు రాకకోసం ఎదురు చూస్తున్న రామయ్యగారు, "ఏమమ్మా యింత ఆలస్యమైంది? తమ్ముడు, చెల్లి ఇంతవరకు నీ కోసం గొడవచేసి యిప్పుడే నిద్రపోయారు" అన్నారు.

వళ్ళు మండిపోయింది వాసంతికి.

"ఎందు కాలస్యం కాదు? రిక్షా డబ్బులు చాలక నడిచి రావలసి వచ్చింది. అమ్మ వుంటే యింత దూరం ఇట్లా నడిపించేది కాదు. మా క్లాసు మేట్సెవరూ నడిచిరారు. అంతా టాక్సీలలోగాని, రిక్షాలలో గాని వస్తారు. ఇకనుంచి ఎప్పుడూ నడిచి వెళ్ళను. రోజు రిక్షాలోనే వెళ్తాను. నాకీ నెలనుంచి యిరవై చొప్పున యివ్వాలి" అంటూ గుడ్లలో నీరు క్రుక్కుకుంది.

"నీకు తెలియని దేముంది తల్లీ? నా దగ్గిరే వుంటే నీకివ్వనా? సరే పోనీలే. ఇవాళ నుంచి నీ యిష్టమే కానీ. ఎంత అవస్థపడైనా నీకు సర్దుబాటు చేస్తాను" అన్నారాయన.

ఈ మాటలకి కోపం తగ్గలేదు గానీ మనస్సు కాస్త చివుక్కుమంది. తడిసిపోయిన చీరె మార్చుకుందామని గదిలోకి వెళ్ళింది. ఎదురుగా కోటు స్టాండుమీద నాన్న రోజూ ఆఫీసుకు వేసుకు వెళ్ళే చిరుగుల గళ్ళకోటు వేళాడుతూ కనిపించింది. దాన్ని చేతుల్లోకి తీసుకుంది వాసంతి. తండ్రి దుస్థితి తలచుకోగానే కళ్ళవెంబడి నీళ్ళు జలజల రాలాయి. తను యిష్టం వచ్చినట్లు తండ్రిని తూలనాడినందుకు చాలా నొచ్చుకుంది.

ఒక్కవరుగున తండ్రి దగ్గరకు వెళ్ళింది.

"ఏమిటమ్మా" అన్నారాయన.

ఏం చెప్పాలో తోచలేదామెకి.

"ఏంలేదునాన్నా! ఇందాక పొరపాటున ఏదో అన్నాను. నాకు పది రూపాయలు చాల్లే. అందులోనే సద్దుకుంటాను" అంది.

□□□